స్కెచ్

# రంగుటద్దాలు

—సుధామ

ఎదురుగా వుంటే ఎక్కడ తన తప్పిదాలు తనకంట బడి భయపెట్టస్తాయో అని కాబోలు ఈ మధ్య కొందరు అద్దాలతో కళ్లు కప్పుకొని, అంతదగ్గరగా అద్దాలను కనుల కెక్కించుకొన్నారు. తమ లోపాలను తమలోనే కప్పుకొని, కళ్ళు విప్పుకొని ఆ అద్దాలలోంచి ఎదుటివాడి లోపాలకు ఎక్స్‌రేలు తీద్దామని యత్నిస్తున్నారు. స్వార్థం, సంకుచితత్వం స్వచ్ఛందంగా విహరిస్తున్న నేడు వాటికి ప్రతీకలుగా రంగుటద్దాలు నిలుస్తున్నాయి. అయిదు పైసలతో చాక్లెట్ కొనుక్కున్న బుడుతడు దానిని భద్రపరిచిన పసుపు చాక్లెట్ కాయితాన్ని కళ్ళకు దగ్గరకు తెచ్చుకొని అందులోంచి తన దృష్టి సారించి "బలే గమ్మత్తుగావుందే! అంతా పసుపుగా కనిపిస్తోంది, అమ్మ పసుపు, నాన్న పసుపు" అని కేరింతలు కొడతాడే. అంతా పసుపు మయం అని తనకెలా కనిపిస్తోందో అంతా అలానే వుంటుంది అని అనుకుంటున్నాడే— అంతే!— పెద్దలదాకా వచ్చినా ఈ బుద్ధిలో పడ లింపులేదు. అయితే వీళ్ళ రంగు మరో రకం. వాడు కాగితం ముక్కలోంచి చూస్తే వీళ్ళు రంగుటద్దాల లోంచి చూస్తారు. కూలింగ్ గ్లాస్ పెట్టుకున్న వాడు ఎండలో చల్లదనాన్ని అనుభవిస్తూ అద్దం రంగులోనే అంటే—ఆకుపచ్చగానో, నీలంగానో అంతటినీ చూడడంలేదూ! అయితే యిప్పుడు కొందరు మహాపురుషులు కేవలం అలా చూడడంలేదు ఆ రంగుటద్దాలలోంచి తమ స్వార్థసంకుచిత రంగుటద్దాల లోంచి లోకాన్ని చూస్తూ అందరూ అలాంటివారే అని కామెర్లరోగికి ప్రపంచమంతా పచ్చనైనట్టుగా భావిస్తున్నారు. నా గ్లాసులలోంచి నేను ఎదుటివాడిని పరిశీలిస్తే—నాలో వున్న ప్రతిలోపమూ వాడిలోనూ వున్నట్టె అగుపిస్తుంది, పిల్లవాడు పసుపుకాగితంలోంచి పరికించినపుడు సమస్తమూ అలానే కనిపించినట్లు. ఎవడికివాడు యిలా తమ గ్లాసుల లోంచి లోకాన్ని పరిశీలిస్తూ. పరిశీలిస్తూన్నప్పుడు స్వార్థం, సంకుచితత్వం చంకలెగరేసుకు తిరుగుతాయే గానీ స్వీయలోపాలు తెలిసేదిలాగ? వంచన నడుంవంచి విరగ్గొట్టి మంచిలోకానికి పంచేదెలాగ?

రంగు అంటే విధము అని అర్థం వుంది. తన రంగుతో తానితరులను చూస్తూంటాడు మనిషి. లాగునే అవి తనకు ముద్దొస్తాయి. అవి పగిలిపోతే అసలు రంగు బయటపడి కళ్లుబైర్లు కమ్మి దొంగపట్టుబడినట్లు ఏమీతోచక, దారి కనిపించక గగ్గోలు పెడతాడు మనిషి. వాటిలోంచి చూడడం అంటే సంకుచితబుద్ధితో చూడడమనేకాదు, భూతద్దాలలోంచి చూడడమని అనుకోవచ్చు. అలా ప్రతిది రంగుటద్దాలలోంచి పరిశీలిస్తావెందుకు?—అంటే స్వార్థం, సంకుచిత బుద్ధులతో చూడడమేగాక గోరంతలు కొండంతలుగాచేసి దానిని ఛప్పన్నసార్లు చెప్పడమే దానికి మరింత రంగుపూసి.

ఇవి ఇప్పట్లో లేని మనిషి దొరకడం కష్టమేమో! ఇవి షాపుల్లో దొరికేవి కావు, అవి కొనుక్కునేందుకు మీరు ఆ దుకాణానికి వెళ్ళినపుడూ ఆ యజమానిగారు వాటి నాణ్యం ఎలావున్నా తన వాటితో బేరిజుకట్టి ధరని మిమ్మల్ని చూసి నిర్వస్తాడు. అది దర్పం పెంచుకొని సర్పంలా మీమీద బుసకొడుతుంది,

జీవితాన్ని వాటిలోనే అనుభవిస్తే ఆనందం ఆర్ణవమై పొంగవచ్చునేమోగానీ. అవి పగిలే రోజులొచ్చాక సుడిగుండాలు ఎదురౌతాయి.

నాయకుడికి పదవినిషా, యజమానికి అధికారదర్పం, వ్యాపారికి లాభాపేక్ష రంగుటద్దాలై వారందులోంచే లోకాన్ని చూస్తూంటే వేశ్య మనుషుల్ని తన గ్లాసులలోంచి చూస్తుంది, అద్దం నీ ఆత్మకాదు నువ్వు చెప్పినట్టు వినడానికి. అద్దంలో నీవు చాటున వుండి చూస్తే ఎదుటివాడు కనిపిస్తాడుగానీ అద్దం తిరగబడి నీ ముందు నిలచినప్పుడు అదానికి ఎదురుగా నీవు నిల్చోవలసివచ్చినపుడు, ఇంతకాలం నువ్వు తనను ఆదరించావని సంతోషించి తన రంగుగ్లాసుల్లోంచి అద్దం నిన్ను చూడదు సరికదా నీ బండారం బయటపెడుతుంది. నీలో వున్న లోపాల భాండాగారం వీధిన పడేస్తుంది. అప్పుడు అద్దంమీద నీ క్రుద్ధం ప్రదర్శించి సహస్ర తునకలు చేసినా అన్ని రంగుల గ్లాసులలోనూ నిన్నే వెక్కిరిస్తుంది. వెయి నాల్కలతో విష భుజంగంలా నీ పాపం నిన్ను చూసి వికటంగా నవ్వుతుంది. ★